రాజీతో పెండింగ్ కేసులకు పరిష్కారం

శ్రీకాకుళం లీగల్ : డిసెంబరు 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి జిల్లాలో పెండింగ్ కేసులను తగ్గించాలని మొదటి అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు న్యాయవాదులకు సూచించారు. స్థానిక జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయవాదులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మూడో మూడవ అదనపు జిల్లా జడ్జి సిహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎల్ ఫణికుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శివప్రసాద్, పి.దామోదరరావు, జి.వాసుదేవరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- ఏ రకం కొన్నా కనీసం కేజీ రూ.60పైనే
- కొన్ని రకాల ధరలు రూ.100 మించి అమ్మకాలు
- మొంథా తుపానుతో తగ్గిన దిగుబడి
- కార్తీకమాసం నేపథ్యంలో పెరిగిన వాడకమూ మరో కారణం

కూరగాయల ధరలు రోజురోజుకూ ఎగబాకుతున్నాయి. ఏ కూరగాయలు కొందామన్నా కేజీ రూ.60కి తక్కువకు రావడం లేదు. బీరకాయలు, బీన్స్, బీట్‌రూట్, చిక్కుడు తదితర కూరగాయలు సెంచరీ కొడుతున్నాయి. కూరగాయల ధరలు పెరుగుదలకు ప్రకృతి వైపరీత్యాలతో పాటు సీజన్‌లు అంశాలూ కారణమవుతున్నాయి. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో వందలాది ఎకరాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. కార్తీక మాసం నేపథ్యంలో కూరగాయల వినియోగం అధికంగా ఉండడంతో ఇదే అదునుగా వ్యాపారులు అధిక ధరలకు కూరగాయలను విక్రయిస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో సుమారు 18 వేల ఎకరాల్లో కూరగాయలు సాగవుతున్నాయి. వీటిలో క్యాబేజీ, బెండకాయలు, దొండకాయలు, వంకాయలు, టమాటా, ఆనపకాయలు, చిక్కుడుకాయలు, తోటకూర, ముల్లంగి, మునగకాయలు, మిరప తదితర రకాల కూరగాయలను ఇక్కడే పండిస్తున్నారు. కూరగాయల సాగు, దిగుబడి బాగానే ఉన్న తరుణంలో ఇటీవల వచ్చిన మొంథా తుపాను రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. దీంతో కూరగాయల దిగుబడిపై ప్రభావం చూపింది. తుపాను, వర్షాలు సాకుగా చూపి వ్యాపారులు అధిక ధరకు విక్రయిస్తున్నారు. మరోవైపు దళారుల హవా కొనసాగుతుండడంతో ధరలు దిగిరావడం లేదు. రైతుల నుంచి తక్కువ రేటుకు కొనుగోలు చేసి, వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒడిశా నుంచి ఎక్కువగా కూరగాయలు వస్తుండడంతో దళారులు, వ్యాపారులు తక్కువ ధర కొనుగోలు చేసి ఇక్కడ ఎక్కువ ధరకు అమ్మి లాభాలు పొందుతున్నారు. వారపు సంతల్లో ఎక్కువగా సాగుతున్నాయి.

రైతుబజార్లలో కొన్ని రకాల కూరగాయలే...

జిల్లాలో పలుచోట్ల రైతు బజార్లు ఉండడంతో, కొంతమేర మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకు లభ్యమై ఉపశమనం కలుగుతోంది. అయితే వీటిలో కొన్ని రకాల కూరగాయలు మాత్రమే లభ్యమవుతున్నాయి. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రకాలు రైతు బజారులో దొరకడం లేదు. పైగా నాణ్యత కూడా పెద్దగా ఉండడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

శ్రీకాకుళం నగరంలో పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్‌లో మాత్రమే బీన్స్, బీట్‌రూట్, క్యారట్, చిక్కుడు వంటి కూరగాయలు దొరుకుతున్నాయి. జిల్లాలో కాశీబుగ్గ, ఇచ్ఛాపురంలో రైతుబజార్లు లేకపోవడంతో వినియోగదారులు అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

కొన్ని రకాల కూరగాయల ధరలు ఇలా...

కూరగాయ రకం	సాధారణ రోజుల్లో (కేజీ రూ.లో)	ప్రస్తుతం (కేజీ రూ.లో)
బెండకాయలు	50	80
దొండకాయలు	40	60
క్యాబేజీ	60	100
క్యారట్	50	70
టమోటా	30	40
పచ్చిమిర్చి	120	150
కాకరకాయలు	40	60
వంకాయలు	40	60
బీరకాయలు	60	80
ఉల్లిపాయలు	50	100
బీట్‌రూట్	60	100

వ్యాపారులు రెండు రకాలుగా దోపిడీ

కూరగాయల విషయంలో వ్యాపారులు రెండు రకాలుగా దోపిడీ సాగిస్తున్నారు. రైతుల నుంచి టోకున తక్కువ ధరకు కొని వినియోగదారులకు అధిక ధరకు అమ్ముతున్నారు. దీంతో అటు రైతులకు గిట్టుబాటు ధర రాకపోగా, ఇటు వినియోగదారులపై అధిక భారం పడుతోంది. మరోవైపు తూకంలో మోసగిస్తున్నారు. కేజీ కూరగాయలు బదులుగా 750 గ్రాములనే వినియోగదారులు అంటగడుతున్నారు. అధికారులెవరూ మార్కెట్ వైపు కన్నెత్తి చూడకపోవడంతో వ్యాపారులు చెప్పిందే ధర, అమ్మిందే తూకం అన్నట్లుగా సాగుతోంది.

దర్శనానికి వెళ్లి వస్తూ...

- ఆటోను ఢీకొన్న వ్యాను
- ఇద్దరు మృతి, తొమ్మిది మందికి గాయాలు
- జలుమూరు మండలం అచ్చుతాపురం వద్ద ఘటన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, లావేరు

జలుమూరు మండలం అచ్యుతాపురం వద్ద బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో లావేరు మండలం గుర్రాలపాలెంకు చెందిన గట్టెం పద్మ (45), గట్టెం అచ్చియమ్మ (52) మృతి చెందారు. తొమ్మిది మంది గాయపడ్డారు. జలుమూరు ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలు ప్రకారం లావేరు మండలం గుర్రాలపాలెంకు చెందిన 14 మంది ఆటోలో ఆలయ దర్శనాలకు బయలుదేరి టెక్కలి మండలం రావివలస వెళ్లారు. తర్వాత జలుమూరు మండలం శ్రీముఖలింగం వెళ్లారు. అక్కడ నుంచి తిరుగు ప్రయాణమవుతుండగా సుమారు 3 గంటల సమయంలో జలుమూరు మండలం అచ్యుతాపురం వద్ద బొలేరో వాహనం వీరి ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వారంతా రోడ్డుపై చెల్లాచెదరుగా పడ్డారు. వీరిలో గట్టెం అచ్చియమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, పద్మ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. అచ్చియమ్మకు భర్త నాగరాజు, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పద్మకు భర్త అప్పలరాజు, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. అంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో గుర్రాలపాలెంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మరో తొమ్మిది మంది గాయపడగా, ముగ్గురు క్షేమంగా బయటపడ్డారు. గాయపడిన వారిని చికిత్స కోసం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అందులో సిర్ర ప్రకాష్, శాంతాటి లక్ష్మి, గట్టెం సుమతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. వీరిని రాగోలులోని జెమ్స్‌కు తరలించారు. మరొకరిని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

ప్రమాదం వార్త తెలుసుకున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి చేరుకున్నారు. మృతుల కుటుంబాలను ఓదార్చారు. క్షతగాత్రులను పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట లావేరు మండల టిడిపి అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎంఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, గుర్రాలపాలెం ఎంపిటిసి జనపాల భానోజీరావు, ఎం సోంబాబు తదితరులు ఉన్నారు.

ప్రమాద ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి

ప్రమాద ఘటనపై వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

గంజాయి రవాణా చేసి విక్రయం ద్వారా లాభార్జనకు ప్రయత్నించిన ఇద్దరు నిందితులకు శ్రీకాకుళం మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించనున్నట్లు తెలిపారు. 2017 నవంబరు 30న ఎచ్చెర్ల గ్రామ పరిధిలోని చిలకపాలెం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా, కార్లలో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను పట్టుకున్నారు.

25న చలో సరుబుజ్జిలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సంఘీభావం తెలియజేస్తున్న థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఈనెల 25న చలో సరుబుజ్జిలి కార్యక్రమం చేపట్టనున్నట్లు థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు వెల్లడించారు. నగరంలోని క్రాంతి భవన్‌లో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి సవర సింహాచలం అధ్యక్షతన బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో ఇండోసోల్ కంపెనీకి ప్రజల భూములను కట్టబెడితే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. థర్మల్ పవర్ ప్లాంట్ వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పు కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు, థర్మల్ ప్లాంట్ వల్ల ఉద్యోగాలు రావని బూడిద, జబ్బులు మాత్రమే వస్తాయన్నారు. ప్రజల భూములను ఇండోసోల్ కంపెనీకి కట్టబెట్టడమే అభివృద్ధా అని మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి చివరి భూముల వరకు నీరిస్తామని చెప్పి, ఎన్నికల అనంతరం మీ భూములు ఇచ్చేయండి అని అనడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా విశాల ఐక్య ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి, న్యూడెమోక్రసీ జిల్లా ఉపాధ్యక్షులు వంకల మాధవరావు, సిపిఐ నాయకులు కొన్న శ్రీనివాసరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.వి జగన్నాథరావు, ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, సవర మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద రిమ్స్ సెక్యూరిటీగార్డుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రిమ్స్ సెక్యూరిటీగార్డులు

రిమ్స్ కాంట్రాక్టు కార్మికులకు ఎంఒయు ప్రకారం బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.మురళి, జిల్లా కార్యదర్శి ఆర్.ప్రకాశరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిమ్స్ సెక్యూరిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిమ్స్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన సెక్యూరిటీగార్డులు కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది ఆకలితో అలమటిస్తున్నా, కార్తికేయ సెక్యూరిటీ కాంట్రాక్టర్, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 15 ఏళ్లుగా సెక్యూరిటీ గార్డులుగా సేవలందిస్తున్న కార్మికులకు చట్ట ప్రకారం ప్రతి నెలా ఐదో తేదీ లోగా వేతనాలు చెల్లించాల్సి ఉన్నా అమలు చేయడం లేదని విమర్శించారు. పిఎఫ్‌లు సక్రమంగా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెక్యూరిటీ సిబ్బందితో పనిచేయించుకోవడానికి బాధ్యత తీసుకుంటున్న రిమ్స్ అధికారులు, కార్మికుల వేతనాలు చెల్లించేందుకు ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్మికుల సమస్యలపై యూనియన్‌తో చర్చించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. అతి తక్కువ వేతనాలతో సెక్యూరిటీ సిబ్బంది కుటుంబాలను నెట్టుకురావడం భారంగా ఉన్న నేపథ్యంలో ఇచ్చే వేతనాలు కూడా సకాలంలో ఇవ్వకపోతే కార్మిక కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. రిమ్స్ సెక్యూరిటీ గార్డుల నిరసనకు సిఐటియు సీనియర్ నాయకులు ఎం.ఆదినారాయణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.రామారావు, ఎం.సూర్యనారాయణ, జె.వెంకటరమణ, టి.రాజేంద్ర, జి.లక్ష్మణరావు, ఎం.శ్రీను, ఎం.మాధవి, కె.రాజేశ్వరి, కుసుమ, ఈశ్వరమ్మ, సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు

నియోజకవర్గ కేంద్రాల్లో వైసిపి ప్రజా ఉద్యమ ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం సిటీ : ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఇలాంటి చర్యల వల్ల పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారుతుందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజా ఉద్యమ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగరంలో డే అండ్ నైట్ కూడలి నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహాశీల్దార్ గణపతిరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుబంధ విభాగాలైన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే రాజ్యాంగ విధులను ప్రభుత్వం ఏం నిర్వర్తించినట్టు అని ప్రశ్నించారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా చెడిపోవడానికి కారణం కార్పొరేట్ వైద్యమేనన్నారు. ఉన్న వైద్యాన్ని కూటమి ప్రభుత్వం పేదవాళ్లకు పకడ్బందీగా అందించే ప్రయత్నం చేయకపోగా, వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన కళాశాలలు, వాటికి అనుబంధంగా పనిచేస్తున్న జిల్లా ఆస్పత్రులను బరితెగించి ప్రైవేటీకరణ చేస్తోందని ధ్వజమెత్తారు. ఇది రాజ్యాంగ విరుద్ధమైన పరిపాలనగా అభివర్ణించారు. ఒకవేళ బరితెగించి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తే వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కళాశాలలు, ఆస్పత్రులను ప్రజలకి ఇచ్చే నిర్ణయం తీసుకుంటుందని హెచ్చరించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, వైద్య విద్య, ప్రభుత్వ ఆసుపత్రులు ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు కుంభా రవిబాబు, నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, కరిమి రాజేశ్వరరావు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : నరసన్నపేటలో పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పెద్దపేట జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, అంబేద్కర్ జంక్షన్, వైఎస్సార్ జంక్షన్, కంబకాయ జంక్షన్, పల్లిపేట జంక్షన్, జిసి హోం జంక్షన్ మీదుగా తహాశీల్దార్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం డిప్యూటీ తహాశీల్దార్ పి.శ్రీనివాసరావుకు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన కృష్ణచైతన్య, నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్య నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు, గ్రామ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ నుంచి పలాస ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లేందుకు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సిద్ధం కాగా, కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ అడ్డుకున్నారు. 50 మందితో ర్యాలీకి అనుమతి ఇస్తామని చెప్పారు. అయినా వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆర్‌డిఒ జి.వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు దుంపల లక్ష్మణరావు, సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు, జిల్లా కార్యదర్శులు బత్తిన హేమేశ్వరరావు, బోర కృష్ణారావు, దువ్వాడ మధుకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంరతం తహాశీల్దార్ కార్యాలయానికి చేరుకుని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు శ్యాంప్రసాద్ రెడ్డి, జెడ్‌పిటిసిలు దువ్వాడ వాణి, పాల వసంతరెడ్డి, దుబ్బ వెంకటరావు, ఎంపిపిలు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని వన్ వే జంక్షన్ నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ ఎస్.రాంబాబుకు నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, నాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు దుంపల శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

కవిటి : కవిటి బస్టాండ్ నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహాశీల్దార్ మురళీమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పిరియా సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్వాల్, ఎంపిపి కడియాల ప్రకాష్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : పాత జాతీయ రహదారి నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహాశీల్దార్ బి.గోపాల్‌కు మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతపట్నం : పాతపట్నం మండల కేంద్రంలో ర్యాలీ అనంతరం తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నియోజకవర్గ పరిశీలకులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నాయకులు అంధవరపు సురేష్, ఎస్.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కళింగాంధ్ర కథలు పోరాటాలకు దిక్సూచి

ప్రజాశక్తి - అరసవల్లి

కళింగాంధ్ర కథలు సిక్కోలు పోరాటానికి దిక్సూచి అని రచయిత కె.భానుమూర్తి అన్నారు. సిక్కోలు పుస్తక మహోత్సవ కార్యక్రమం రెండో రోజు బుధవారం ఎన్‌టిఆర్ మున్సిపల్ మున్సిపల్ మైదానంలో కాళీపట్నం రామారావు సాహిత్య వేదికలో కళింగాంధ్ర వచన సాహిత్యంపై ఆయన మాట్లాడారు. జిల్లాలో అనేక మంది కవులు కళింగాంధ్ర జీవనంపై సాహిత్య రూపంలో చైతన్యం తెచ్చారని తెలిపారు. కా.రా మాస్టారు యువతకు తెలుగు భాషపై ఆసక్తి పెంచడానికి పెంచడానికి కథానిలయం స్థాపించారని దాసరి రామచంద్రరావు అన్నారు. తెలుగు భాష కథలు, నవలలు రావిశాస్త్రి ప్రాంతీయతత్వంతో రచనలు చేశారని, తెలుగు భాషకు వన్నె తెచ్చారని భమిడిపాటి గౌరీశంకర్ అన్నారు. రచయిత కూన రంగ నాయకులు రచించిన 'ఆఖరి మెట్టు', 'కూన కథలు' పుస్తకాలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ రోణంకి గోవిందరావు ఆవిష్కరించారు. బి.వి రమణ, పిసిని వసంతరావు పుస్తకాలను పరిచయం చేశారు. అనంతరం తెప్పల కృష్ణమూర్తి, బి.వి రమణ, పి.ఎస్ నాగరాజు, మండా శ్రీనివాస్, గణేశ్వర బాబ్జీ, రోణంకి విశ్వేశ్వరరావు, బమ్మిడి సుబ్బారావు, మడ్డు నాగేశ్వరరావు, తంగి ఎర్రమ్మ, ఉదయకిరణ్ తదితరులు కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. అనంతరం డప్పు శ్రీను 'అక్షరం నీకు వందనం నా మస్తకానికి సాన పట్టిన పుస్తకం నీకు వందనం' పాట పాడారు. దుంపల ఈశ్వరరావు హరినామం అంతేయూ నీవే, శంభో శంభో అంటూ అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం శివతత్వం, విష్ణుతత్వం, రామతత్వంపై ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

ఆఖరి మెట్టు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోవిందరావు తదితరులు

విక్రయ ప్రకటనను నిర్ణయించుటకు కుదిర్చిన దినమును గురించి నోటీసు
(OR-21, RULE-64)
మహారాజశ్రీ 4 వ అదనపు జిల్లా జడ్జ్ కోర్టు వారు శ్రీకాకుళం.
E.P.222/2025 in O.S.38/2012

Between:
Konala Venkata Reddi ....Petitioner-D.Hr
And:
1) Balivada Panduranga (Since Died).
2) Balivada Rajeswari (Since Died).
3) Balivada Prasanth Kumar and 2 others.
.....Respondents-J.Drs.

To,
J.Dr-3: Balivada Prasanth Kumar, S/o late Pandu Ranga, Door No: 8-6-90, Gorlevari Veedhi, G.T.Road, Srikakulam Town and District.
J.Dr-4: Balivada Nirmal Kumar, S/o late Pandu Ranga, ---Rest-do---

పైడ్ చెప్పబడింగ్ వాజ్యంలోని డిగ్రీనీ పొందినవాడు అయిన వాది జప్తు కాబడిన స్థిర/చెరఆస్తి యొక్క విక్రయమునకు కు మనవి చేసుకొన్నాడు గనుక, విక్రయ ప్రకటన యొక్క షరతులను నిరీయించుటకు గాను 08-12-2025 దిన కుదర్చబడినదిని నీకు తెలుపబడమైనది.

చిగురుపల్లి రామ మోహన్
న్యాయవాది,
దవళ కాలనీ, జి. టి. రోడ్డు,
శ్రీకాకుళం పట్టణం మరియు జిల్లా.
ఫోన్: 9440116221.

IN THE HON'BLE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) AT PATHAPATNAM
O.S.No.30/2025

Between:
A.P. Grameena Bank, Budithi Branch, Rep. by its Branch Manager (formerly known as A.P. Grameena Vikas Bank) ----Plaintiff
And:
Kuna Chinnammi & another ----Defendants

NOTICE

To,
1) Kuna Chinnammi, W/o. late Lakshmana Rao, aged 48 years, Subhramanyapuram village, Jalumuru Mandal, Srikakulam Dt.
2) Kuna Balaraju, S/o. late Lakshmana Rao, aged 25 years, ---rest-do---

Please take notice that the above named plaintiff has instituted the above suit against you and the same is stands posted to **28-11-2025 at 10.30 A.M.** for yours' appearance. On that day you shall personally or through an Advocate attend before the above named Hon'ble Civil Judge (Junior Division) court, Pathapatnam, failing which the matter will be heard and determined in your absence and you will be set as ex-parte as per law.

// By Court Order //

CH. SATYANARAYANA
Advocate for Plaintiff,
Amadalavalasa, Srikakulam Dist,
Cell: 9848098139.

వజ్రపుకొత్తూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం

SR-110, మెయిన్ రోడ్,
వజ్రపుకొత్తూరు.

టెండర్ ప్రకటన

ఎప్. నెం. 3/2025-2026 తేది: 12-11-2025

దిగువ పేర్కొనబడిన పనుల నిర్మాణం కొరకు అర్హులైన కాంట్రాక్టర్ల నుండి బిడ్లు కోరబడు చున్నవి.
పనిపేరు : వజ్రపుకొత్తూరు PACS అదనపు భవనం నిర్మాణం కొరకు, వజ్రపుకొత్తూరు గ్రామంలో

1	అంచాన విలువ	రూ. 28 లక్షలు
2	E.M.D	రూ. 28,000/-
3	కాంట్రాక్టరు వ్యవధి	6 నెలలు
4	కాంట్రాక్టరు అర్హత	క్లాస్ 3 మరియు ఆపైన పనులకు సంబంధించి
5	షెడ్యూల్ బిడ్ స్వీకరింపు తేది	తేది 13-11-2025 ఉ॥ 10గం॥ల నుండి సా॥ 4గం॥ల వరకు PACS వేళల్లో
6	షెడ్యూల్ బిడ్ ముగింపు తేది	తే॥ 15-11-2025 మధ్యాహ్నం 12 గం॥ ల వరకు
7	షెడ్యూల్ పరిశీలన తేది	తే॥ 15-11-2025 మధ్యాహ్నం 1 గం॥ నుండి 4 గంటల వరకు
8	సాంకేతిక మరియు ఫైనాన్స్ియల్ బిడ్ తెరుచు తేది	తే॥ 15-11-2025 సాయంత్రం 5 గంటల వరకు

సంబంధిత అధికారి అంధి జగదీశ్వరరావు, ముఖ్యకార్యనిర్వహణాధికారి,PACS' వజ్రపుకొత్తూరు. పైన తెలుపబడిన పనుల యొక్క టెండర్ డాక్యుమెంట్ నిబంధనలు మరియు ఇతర వివరములను పొందుటకు ముఖ్య కార్యనిర్వహణాధికారి, PACS, వజ్రపుకొత్తూరు మీద రూ.1000/-లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గాని, ఏదైన షెడ్యూల్ బ్యాంక్ లో గాని డిమాండ్ డ్రాఫ్ట్ (DD) తీసి వజ్రపుకొత్తూరు పి.ఎ.సి.ఎస్ సహకార సంఘం నందు అందజేయగలరు. **గమనిక:** ముఖ్యకార్యనిర్వహణాధికారి, PACS, వజ్రపుకొత్తూరు వారికి టెండరు భాగముల వారీగా విడదీయుట, వాయిదా వేయుటకు లేదా ఏ ఇతర కారణములు చూపించకుండా తిరస్కరించుటకు (లేదా) రద్దు చేయుటకు అధికారం కలదు.

అంధి జగదీశ్వరరావు
ముఖ్యకార్య నిర్వహణాధికారి
ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం,
వజ్రపుకొత్తూరు గ్రామం, వజ్రపుకొత్తూరు మండలం,
ఫోన్: 9703843191.

కణితి సురేష్ చౌదరి
చైర్ పర్సన్,
ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం,
వజ్రపుకొత్తూరు గ్రామం, వజ్రపుకొత్తూరు మండలం,
ఫోన్: 9948427458.

మాట్లాడుతున్న నాగమణి

'ఆశా'ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి- రణస్థలం

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనాలు పెంచాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని కోష్టలో ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెలవు లేకుండా ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని తెలిపారు. పిఎఫ్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు గత ఆరేళ్ల నుంచి ఒక్క రూపాయి వేతనం పెంచలేదన్నారు. అలాగే డిఎ కూడా అమలు చేయడం లేదని అన్నారు. ఆశాలకు ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదని, అయినా రకరకాల యాప్ భారం వేస్తున్నారని అన్నారు. 5జి సపోర్టెడ్ పనిచేసే ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనాలు ప్రతి నెల 1న చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మికవర్గ పోరాటాలను నిర్మించేందుకు సిఐటియు అఖిలభారత మహాసభలు దోహదపడతాయని తెలిపారు. కార్మికవర్గం దశాబ్దాలుగా అశేష త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని అన్నారు. సమావేశంలో పి.రాజు, సుభద్ర, పైడి లక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

డిసెంబరు 31 నుంచి విశాఖపట్నంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుదర్శన పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురంలో సిఐటియు అఖిల భారత మహాసభ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మికవర్గ హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు విశాఖలో నిర్వహించనున్న సిఐటియు అఖిలభారత మహాసభలు దోహదపడతాయని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచుతూ చట్టం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రంగాల శ్రీనివాసరెడ్డి, రమేష్‌పట్నాయక్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బి.హైమావతి, బాలమణి, వి.హేమలత, సిహెచ్.భారతి, కృష్ణవేణి, నరసమ్మ, సుహాసిని పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అర్హులందరికీ గృహాలు కూటమి ప్రభుత్వం అందిస్తుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు గృహ నిర్మాణ పత్రాలను గ్రామ పీడీ సుధాకరరావు అధ్యక్షతన బుధవారం పంపిణీ చేశారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2 ఇళ్ల మంజూరైన లబ్ధిదారులకు గృహ నిర్మాణ పత్రాలను అందజేశారు. మున్సిపాలిటీలో 124 మంజూరయ్యాయని గృహ నిర్మాణశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, టిడిపి నాయకులు కొండ శంకర్‌రెడ్డి, రెయ్య జానికిరామ్, సుభాస్ రౌలో, హౌసింగ్ ఎఇ ప్రసాద్, వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

పలాస : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస : ప్రతి పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 27 వార్డుల్లో బుధవారం నూతన గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం 11 మంది లబ్ధిదారులకు మంజూరైన గృహ నిర్మాణ పత్రాలను పంపిణీ చేశారు. పలాస నియోజకవర్గంలో 1508 ఇళ్లు పూర్తి అయ్యాయని అన్నారు. 1029 మందికి అదనంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, వార్డు కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, లొడగల కామేశ్వరరావు, డొక్కరి శంకర్, టంకాల రవిశంకర్ గుప్తా, అంబటి కృష్ణమూర్తి, సప్ప నవీన్, మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

పాతపట్నం : పేదలందరికీ నూతన గృహాలు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని తిడ్డిమిలో నూతన గృహప్రవేశాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో డ్వామా కార్యనిర్వాహణ అధికారి డి.సత్యనారాయణ, టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్, ఎంపిడిఒ, గృహ నిర్మాణశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : గృహ నిర్మాణ పత్రాలను అందజేస్తున్న విప్ అశోక్

నరసన్నపేట : మండలంలోని తలసముద్రంలో నూతన గృహాలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బిరియాపల్లి వెంకట అప్పలనాయుడు, కిల్లి వేణుగోపాలస్వామి, మాజీ సర్పంచ్‌లు ప్రగడ హరిబాబు, భావన ప్రసాదరావు, జల్లు రామారావు, బైరి సుందరరావు, పండి శ్రీనివాసరావు, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ రవికుమార్, గృహ నిర్మాణ అధికారులు పాల్గొన్నారు.

పొందూరు: ప్రతి పేదవాడికీ సొంతింటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల అన్నారు. మండలంలోని లోలుగులో లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్, గృహనిర్మాణశాఖ డిఇ డి.సన్యాసిరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి రఘునాథ్, ఎంపిడిఒ వాసుదేవరావు, తహశీల్దార్ వెంకటేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోదిస్తున్న మృతుని భార్య

అస్వస్థతకు గురై గ్రానైట్ కార్మికుడు మృతి

టెక్కలి రూరల్ : టెక్కలి మండలం రావివలసలోని గ్రానైట్ క్వారీలో కార్మికుడిగా పనిచేసిన గేదెల యర్రయ్య (48) బుధవారం అస్వస్థతకు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. మండలంలోని పరశురాంపురానికి చెందిన యర్రయ్య మధ్యాహ్నం భోజనం అనంతరం ఒక్కసారిగా అస్వస్థతకు గురై పడిపోయాడు. క్వారీ సిబ్బంది టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. యర్రయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గాయపడిన అప్పమ్మ, మోనేష్

గ్యాస్ లీక్ : ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని బురిడికంచరాంలో బుధవారం గ్యాస్‌లీకై మంటలు వ్యాపించడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... వండాన రామారావు ఇంట్లోని వెనుక గదిలో గల గ్యాస్‌లీక్ అయ్యింది. సాయంత్రం పొలం పనులు చేసుకుని ఇంటికి వచ్చిన ఆయన తల్లి అప్పమ్మ గ్యాస్‌స్టవ్‌ను ముట్టించడంతో ఒక్కసారిగా ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. దీంతో అప్పమ్మకు చేతులు, మొఖం కాలిపోగా, అక్కడే ఉన్న మనవడు మోనేష్‌కు రెండు కాళ్లు, చేతులు కాలిపోయాయి. అలాగే మనవరాలు జ్ఞానేశ్వరికి కూడా తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే ఆటోతో శ్రీకాకుళంలోని ప్రవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు.

అందెశ్రీ ఆశయాలు కొనసాగిద్దాం

ప్రజాశక్తి- అరసవల్లి

మాట్లాడుతున్న దేవిశ్రీ

అందెశ్రీ సాహిత్య వారసత్వాన్ని కొనసాగిస్తామని విశాఖకు చెందిన ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ అన్నారు. స్థానిక మున్సిపల్ మైదానంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవంలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందెశ్రీ కేవలం కవి కాదు, తెలుగు సాహిత్యానికి దిక్సూచి అని అన్నారు. ఆయన పదాలు మట్టివాసనతో, మానవతా విలువలతో, పోరాట పిలుపుతో నిండినవి అన్నారు. ఆయన ఒక గొప్ప వాగ్గేయకారుడు మాత్రమే కాదని, అద్భుతమైన చరిత్రకారుడు కూడా అని పేర్కొన్నారు. ఆయన మన మధ్య లేరనేది సాహిత్య రంగానికి తిరుగులేని లోటని అన్నారు. అందెశ్రీ కలం సామాన్యుడి ఆవేదనను అక్షరాలుగా మలిచిందన్నారు. ఆయన చూపిన దారిలోనే నేను గానంతో ప్రజల్లో చైతన్యం నింపుతున్నానని తెలిపారు. ఆయన సాహిత్య వారసత్వం నిలబెట్టడం మనందరి బాధ్యత అని అన్నారు. అందెశ్రీ ప్రసిద్ధ గీతం మాయమై పోతున్నడమ్మా మనిషి అన్నవాడు పాటను ఆలపించారు. సిక్కోలు పుస్తక మహోత్సవం గురించి మాట్లాడుతూ పుస్తకం చదవడం మంచి అలవాటని అన్నారు. పుస్తకం చదవడం వల్ల నైతిక విలువలు పెరుగుతాయని అన్నారు. సిక్కోలు విప్లవ కవుల పురిటి గడ్డ అని, పూర్వ కవులు అందరూ అక్షర సత్యాలు పుస్తకాల్లో పొందుపరిచారని అన్నారు. గిడుగు, గురజాడ, గరిమెళ్ల సత్యనారాయణ, వంగపండు మంచి గాయకులు, కవులని వారి వల్ల తెలుగు భాషాభివృద్ధి చెందుతుందన్నారు. కథానిలయం వ్యవస్థపకులు కాళీపట్నం రామారావు వల్ల తెలుగు కథలకు, పుస్తకాలకు దశ దిశ చూపించి కథలు 'కంచికి కాదు' కదానిలాయానికి చేర్చేటట్లు చేశారని అన్నారు. కార్యక్రమం కేతవరపు శ్రీనివాసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వాసుదేవరావు

మహాసభలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఈ నెల 16 టెక్కలిలో నిర్వహించనున్న జిల్లా రైతు మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు బగాది వాసుదేవరావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. టెక్కలి సత్తారు లోకనాథం అన్నపూర్ణమ్మ కళ్యాణ మండపంలో రైతు జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 9.30 గంటలకు టెక్కలి ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు చేరుకొని ప్రదర్శనగా వెళ్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలన్నారు. తేమ శాతం పెంచాలన్నారు. భూముల సర్వే లోపాల్ని సరిచేయాలన్నారు. దున్నే వాడికే పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి యల్లయ్య, దాసరి రవిబాబులు తెలిపారు.

కొత్తూరు ఎస్‌ఐగా చంద్రశేఖర్

కొత్తూరు : కొత్తూరు ఎస్‌ఐగా కె.చంద్రశేఖర్ స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన హిరమండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ అలీ గత కొన్ని రోజులుగా విఆర్‌లో ఉన్నారు.

ప్రమాదానికి గురైన కారు

తప్పిన ప్రమాదం

నందిగాం : మండలం నందిగాం పాతబస్టాండ్ వద్ద బుధవారం రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడ్డారు బరంపురం నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారుకు పంచర్ అయ్యింది. డ్రైవర్ అప్రమత్తమై దారి మళ్లించడంతో సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టింది. అనంతరం సర్వీసు రోడ్డు పైకి దూసుకొచ్చింది. దీంతో కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఇఎస్‌ఐపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి

ఎంప్లాయిమెంట్ స్టేట్ ఇన్సూరెన్స్ పథకం అమలుపై ప్రతిఒక్క కార్మికునికీ అవగాహన అవసరమని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఇఎస్‌ఐపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. పది మందికి పైగా కార్మికులు ఉన్న ప్రతి ఒక్క సంస్థా చట్టం పరిధిలోకి వస్తుందన్నారు. డిసెంబరు 31 లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. గత ఐదేళ్లుగా నమోదు చేసుకున్న సంస్థలు కూడా చట్టం పరిధిలోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్‌కుమార్, మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఎఎల్‌ఒ ఆర్.రాధాకుమారి, ఇఎస్‌ఐశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యామ్‌ప్రసాద్, పి.శ్రీనివాస్, ప్రజ్ఞా వర్తక సంఘం అధ్యక్షుడు లాడి శ్రీనివాస్, సిఐటియు నాయకులు సిహెచ్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

మాట్లాడుతున్న సిఐ చిన్నంనాయుడు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన వి.సతీష్‌కుమార్, బాలుడుని అరెస్టు చేసి 20 కేజీల 670 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఒడిశా నుంచి అక్రమంగా తెచ్చిన గంజాయితో ఇచ్ఛాపురం రైల్వే స్టేషను వద్ద పట్టుపడ్డారని తెలిపారు. గంజాయి, సెల్‌ఫోనను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ ఎస్‌ఐ ముకుందరావు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లకు నిబంధనలు తప్పనిసరి

సమీక్షిస్తున్న ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ మేరీ కేథరిన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

లింగనిర్ధారణ విషయంలో స్కానింగ్ సెంటర్లు కచ్చితంగా నిబంధనలు పాటించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జ్ డిఎంహెచ్‌ఒ డాక్టర్ మేరీ కేథరిన్ హెచ్చరించారు. నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం డిస్ట్రిక్ట్ లెవల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ ఆథారటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పరిధిలోని అన్ని స్కాన్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రులు తప్పనిసరిగా పిసిపిఎన్‌డిటి యాక్టును పాటించాలన్నారు. సిసి కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా ఉండాలని చెప్పారు. ఫారమ్-ఎఫ్‌లను విధిగా అప్‌లోడ్ చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన స్కాన్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ వర్కర్ డాక్టర్ మంత్రి వెంకటస్వామి మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టంపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్‌ఒ డాక్టర్ తాడేల శ్రీకాంత్, అడ్వయిజరీ కమిటీ సభ్యులు స్వర్ణలత, కిరణ్‌కుమార్, రాజేష్‌కుమార్, ఆర్.శ్రీనివాస్, ఎస్.విజయలక్ష్మి, పి.మోహినీరత్నకుమారి పాల్గొన్నారు.

మురుగు కాలువలో ఉన్న తాగునీటి పైప్‌లైన్

మురుగు కాలువలో తాగునీటి పైప్‌లైన్

ప్రజాశక్తి- పొందూరు

మురుగు కాలువలో తాగునీటి పైపులైన్ కనిపిస్తున్న ఈ దృశ్యం పొందూరు మండలం కింతలి గ్రామంలోనిది. గ్రామంలో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కొళాయిలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్ కాలువలోనే వేయడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండేళ్లుగా మురగుకాలువలోనే పైప్‌లైన్ ఉన్నా... సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై దారుణమంటూ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. సచివాలయం ఎదరుగానే ఉన్న ప్రధాన రహదారి పక్కనే గల కాలువలోనే ఈ పైప్‌లైన్ ఉండగా నిత్యం అధికారులు ఆ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. మురుగు కాలువలోనే తాగునీటి పైప్‌లైన్ ఉన్నా వాటిని తొలగించకుండా అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. మురుగుకాలువలో పైప్‌లైన్ వెంటనే తొలగించకపోతే కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

ప్రజాశక్తి- లావేరు

ఈ ఏడాది చేపట్టనున్న ఉపాధి హామీ పనులను గుర్తించాలని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఊర్లపు లక్ష్మి ఆధ్వర్యాన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లావేరు పంచాయతీలోని ఉపాధిహామీ ఎక్కడ ఎటువంటి పనులు కావాలని తెలిపితే వాటిని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. 15 చెరువులు, 15 ఛానళ్ల అభివృద్ధికి, మరో 25 గ్రావెల్ మట్టి రోడ్ల నిర్మాణానికి, రెండు సిసి రోడ్ల నిర్మాణానికి, లావేరు, జి.జి.వలస, కేశవరాయపురం, లావేటిపాళెం గ్రామాల్లోని నాలుగు శశ్మాసన షెడ్ల నిర్మాణం, బర్రెల గ్రౌండ్ ఏర్పాటు చేసేందుకు గుర్తించామన్నారు. మొత్తం రూ.3.15 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. సమావేశంలో కార్యదర్శి దాలినాయుడు, కూటమి నాయకులు లంకలపల్లి శ్రీనివాసరావు, మహేష్ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : మండలంలోని పురుషోత్తపురంలో ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. టిడిపి నాయకులు కిల్లి లక్ష్మణరావు, జనసేన నాయకులు, పిఎసిఎస్ డైరెక్టర్ పైడి మురళీమోహన్, గోపి, ప్రసాద్, రాజారావు, వరహాల నరసింహులు, కృష్ణ, విష్ణు, ఎం.వరహాలనాయుడు, జి.తవిటినాయుడు, ఎం.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక ఎన్‌ఆర్‌ఇజి కార్యాలయంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ఆధ్వర్యాన ఉపాధి హామీ పనులపై బుధవారం సమీక్షించారు. ఈ ఏడాది చేపట్టనున్న పనుల ప్రణాళికపై విశ్లేషించారు. ఈ సందర్భంగా వర్మీకంపోస్టు యూనిట్లు, గోవుల షెడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాల అమలు స్థితిపై అధికారులు చర్చించారు. పనుల నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లక్ష్యాల సాధనకు సమయపాలనతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ టి.రవి, ఇసి ఆదినారాయణరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లావేరు : మాట్లాడుతున్న తోటయ్యదొర

వారిని తొలగించాలి

- గైర్హాజరైన ఎఎన్‌ఎంలపై కలెక్టర్ ఆగ్రహం
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని రాజపురం పిహెచ్‌సికి డెప్యూటేషన్‌పై వెళ్లి విధులకు హాజరుకాకుండా గైర్హాజరైన ఇద్దరు ఎఎన్‌ఎంలను విధులు నుంచి తొలగించాలని జిల్లా ఉప వైద్యాధికారికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశించారు. అదే సమయంలో ప్రజా వైద్యానికి ఆటంకం కలగకుండా వారం రోజుల్లోగా రాజపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ముగ్గురు, నలుగురు ఎఎన్‌ఎంలను డిప్యుటేషన్ వేయాలని సూచించారు. 'వ్యాక్సిన్ వేసేదెవరు?' అంటూ సోమవారం 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించారు. పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించడంతో డాక్టర్ శశిధర్ మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. డాక్టర్ శశిధర్‌తో మాట్లాడిన కలెక్టర్ జిల్లా ఉప వైద్యాధికారికి పై ఆదేశాలు జారీ చేశారు.

పొందూరు : అవగాహన కల్పిస్తున్న అధికారులు

కవిటి : పరిశీలిస్తున్న ఎఒ శ్రీదేవి

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

ప్రజాశక్తి- పొందూరు

వ్యవసాయ యాజమాన్య పద్ధతులను రైతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మొదలవలస రేణుకసాయి పేర్కొన్నారు. మండలంలోని మలకాం, తండ్యాం గ్రామాల్లో బుధవారం ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, ఆత్మ పథకాల ద్వారా రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి పంటకు సంబంధించి వరి రకాలు, కలుపు యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, నీటి యాజమాన్యం, దోమపోటు నివారణ చర్యలు గురించి తెలిపారు. అలాగే మొక్కజొన్న, పెసర, మినుము పంటలకు సంబంధించి కూడా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కిల్లారి భాస్కరరావు, ఎఒ మొజ్జాడ శ్రీనివాస్‌బాబు, విఎఎ వెంకటేష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రబీ సీజన్‌లో రైతులు వరి పంటకు బదులుగా చోడి, మొక్కజొన్న పంటలను సాగుచేసుకోవాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు అన్నారు. మండలంలోనిఎత్తురాళ్లపాడులో మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావుతో కలిసి బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తక్కువ నీటి ఖర్చు, పెట్టుబడులు కలిగి అధిక లాభాలు ఇస్తున్న చోడి, మొక్క జోన్న పంటలను రైతులు సాగుచేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మాధవి పాల్గొన్నారు.

కవిటి: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎఒ పిరియా శ్రీదేవి అన్నారు. మండలంలోని కొజ్జిరియా, రఘునాథపురం, చండిపుట్టుగ గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కొజ్జిరియాలో వేసిన ఆర్‌జిఎల్ 7039 మినీకిట్ క్షేత్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. అనంతరం రబీ పంటకు అవసరమైన విత్తనాలపై రైతుల సందేహాలు నెరవేర్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు నిర్మల, లావణ్య, భవాని పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వరి పంట పొలాలు పరిశీలన

సోంపేట : మండలంలోని జింకిభద్ర, బెంకిలి, పలాసపురం రైతు సేవా కేంద్రాల పరిధిలో శ్రీకాకుళం సన్నాలు వరి రకం వెన్ను బయటికి వచ్చే దశలో ఇతర రకాల కలయిక కంకులు బయటపడిన సందర్భంలో రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల వద్ద ప్రస్తావించిన నేపథ్యంలో బుధవారం అధికారులు పంట పొలాలను పరిశీలించారు. వ్యవసాయ సిబ్బంది శాస్త్రవేత్తలు ఆంధ్రప్రదేశ్ విత్తన అభివృద్ధి సంస్థ అధికారులు క్షేత్రాలను తనిఖీ చేసి రైతులకు సమస్యను నుంచి ఉపశమనం కలిగించే దిశగా చర్యలు చేపట్టారు. ఎపి సీడ్స్, వ్యవసాయ శాఖ క్షేత్ర సిబ్బంది పొలాలను ప్రాథమికంగా పరిశీలించారు. రాగోలు వరి పరిశోధన స్థానం అధిపతి, సంకరణ నిపుణులు డాక్టర్ కె.మధుకుమార్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ, సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీశంకర్, ఎఒ బి.నరసింహమూర్తి, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

కడుం హాస్టల్ విద్యార్థికి అరుదైన వ్యాధి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కడుమ బిసి బాలుర వసతిగృహంలో పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం నేరడికి 8వ తరగతి చదువుచున్న జి.ఈశ్వర్ చదువుతున్నారు. ఈయనకు స్క్రబ్ థైపాస్ అనే అరుదైన వ్యాధి సోకింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ అధికారు లకు ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం విశాఖపట్నం కెజిహెచ్ తరలించారు. ప్రస్తుతం ఈశ్వర్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఎంపిడిఒ నీజర, కురిగాం పిహెచ్‌సి వైద్యులు పెద్దిన ప్రసన్నకుమార్, సర్పంచ్ గుజ్జ రామారావులు హాస్టల్‌ను సందర్శించి పరిసరాలను పరిశుభ్రతను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని హాస్టల్ అటెండర్ విజయభాస్కర్, కుక్ సుదర్శన్‌లకు ఆదేశించారు. వీరితో పాటు ఇఒ బుజ్జిబాబు, పిఎస్ ఉమారాణి ఉన్నారు.

కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ఈశ్వర్

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

వజ్రపుకొత్తూరు: వచ్చే ఏడాది ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని పూండి గోవిదంపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలకు సంబంధించిన తరగతి గదులు, మౌలిక సదుపాయాలను బుధవారం పరిశీలించారు.నీ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించి తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఇంటర్ బోర్డు ప్రకారం తరగతులు, స్టడీ అవర్స్ పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. సకాలంలో పాఠ్యాంశాలు బోధించి వాటిపై పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలని అధ్యాపకులకు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు భీమేశ్వరరావు, రమేష్ పట్నాయక్, అధ్యాపకులు కేశవరావు పాల్గొన్నారు.

న్యూమోనియా నివారణ మన చేతుల్లోనే..

మెడికవర్ ఆస్పత్రి వైద్యులు భాగ్యరాజ్

భాగ్యరాజ్, వైద్యాధికారి

శ్రీకాకుళం: న్యూమోనియా నివారణ మన చేతుల్లోనే ఉందని మెడికవర్ ఆస్పత్రి శ్వాసకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ అల్లా భాగ్యరాజ్ అన్నారు. బుధవారం ప్రపంచ న్యూమోనియా దినోత్సవంగా మాట్లాడారు. న్యూమోనియా ఊపిరితిత్తుల్లో బాక్టీరియా, వైరస్, ఫంగల్ ఇన్ఫెక్షన్ వల్ల కలిగే శ్వాసకోశ వ్యాధి వస్తుందన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ప్రాణాపాయకరంగా మారే అవకాశం ఉంటుందన్నారు. న్యూమోనియా లక్షణాలు, అధిక జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతిలో నొప్పి, అలసట ఈ లక్షణాలను ప్రారంభ దశలో గుర్తిస్తామన్నారు. సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం ముఖ్యమన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

5 నుంచి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు

ప్రజాశక్తి - అరసవల్లి

డిసెంబరు 5 నుంచి శ్రీకాకుళం రంగస్థలం కళాకారుల సమాఖ్య ఆధ్వర్యాన ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు బాపూజీ కళామందిర్‌లో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. 5న ఎప్పుడూ వారిదే అందరూ మంచివారే కానీ నాటిక, అదే రోజు విజయవాడ వారిచే క్రతువు నాటిక, 6న హైదరాబాదు వారిచే అమ్మ చెప్పిన బొమ్మ నాటిక, అదే రోజు తెనాలి వారిచే ఎవరు నాటిక, 7న గుంటూరు వారిచే సహన నాటిక, అదే రోజు కట్రపాడు వారిచే మంచి మనసులు నాటిక, అదేరోజు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని సంస్థ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎల్.రామలింగస్వామి, పొన్నాల నరసింహమూర్తి, రామచంద్రదేవ్, బి.ఎ.మోహనరావు, రమణారావు, జ్యోతి, వంజరాపు సత్యం, అప్పారావు, శరత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న షేక్ నిజాముద్దీన్

జామియా మసీదు నూతన అధ్యక్షునిగా షేక్ నిజాముద్దీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రాచీన, ప్రసిద్ధి కలిగిన నగరంలోని జిటి రోడ్డు ఉన్న జామియా మసీదు కు ఎట్టకేలకు నూతన పాలకవర్గం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు నియమించింది. షేక్ నిజాముద్దీన్, పది మంది సభ్యులతో కూడిన నూతన కార్యవర్గం నియమించిన సందర్భంలో స్థానిక జామియా మసీదులో కమిటీ సభ్యులతో కలిసి షేక్ నిజాముద్దీన్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తనను అధ్యక్షునిగా నియమించినందుకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ జబీర్, కమిటీ సభ్యులు మీర్ అసదుల్లా, అబ్దుల్ గఫార్ ఖాన్, ఎండి యాసీన్, షేక్ నబీల్, ఎండి ఇబ్రహీం, షేక్ షాన్ బాషా, జుల్ఫికర్ అలీ బేగ్, ఎండి రఫీ, బహదూర్ బాషా, జామియా మసీదు జమాత్ సభ్యులు షేక్ జానీ, ఎండి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నగర టిడిపి అధ్యక్షునిగా శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పాండ్రంకి శంకర్

హరగోపాల్

శ్రీకాకుళం తెలుగుదేశం పార్టీ పట్టణ టిడిపి అధ్యక్షునిగా పాండ్రంకి శంకర్‌ను నియమిస్తూ పార్టీ బుధవారం ప్రకటించింది. గురువారం ఉదయం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యదర్శిగా హరగోపాల్‌ను నియమించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మద్దతు వీరికి ఉండటంతో పదవులు వచ్చాని సమాచారం. గత కొంతకాలంగా నగర అధ్యక్షుని ఎంపికకు సంబంధించి సస్పెన్స్ నెలకొంది. ఈ నేపథ్యంలో నియామకం పూర్తికావడంతో సస్పెన్షకు తెరలేచింది. శ్రీకాకుళం మున్సిపాల్ కార్పొరేషన్ ఎన్నిలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేసే క్రమంలో ఈ నియామకాలు జరిగినట్లు సమాచారం.

మాతృత్వం వరం... దత్తత ఇంకో మార్గం

ప్రజాశక్తి - మందస

సమాజంలో కుటుంబ వ్యవస్థ పటిష్టతకు, భూమిపై మానవ మనుగడకు సృష్టిలో మహిళకు మాతృత్వం ఒక వరమని, చట్టపరమైన దత్తత అందుకు మరో మార్గమని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో యాజాక రమణమ్మ అధ్యక్షతన మిషన్ వాత్సల్య బాలల రక్షణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో వివిధ కారణాల వల్ల కన్నా వారికి అవసరం లేని పిల్లలను అన్ వాంటెడ్ చిల్డ్రన్‌ను అనవసరంగా చంపే హక్కు ఎవరికీ లేదన్నారు. సమీప ఆరోగ్య కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ఊయల్లో వేయవచ్చని తెలిపారు. బాలల రక్షిత గృహాలకు ఎవరి ద్వారా అయినా అప్పగించవచ్చని, వారి

రంగస్థలం : ర్యాలీ నిర్వహిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

పేరును గోప్యంగా ఉంచుతామని వివరించారు. పిల్లలు లేని దంపతులు ఎవరైనా చట్టబద్ధమైన దత్తత పొందడానికి శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా బాగుండాలని అన్నారు. మీసం వాత్సల్య పథకం ద్వారా దత్తత కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అర్హులైన దంపతులకు వారి వయసు ఆధారంగా పిల్లలను కారా నిబంధనలు, సీనియార్టీ లిస్టు ప్రకారం మిషన్ వాత్సల్య ద్వారా బిడ్డను రిజర్వు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ విభాగం సిబ్బంది సింగూరు శ్రీనివాసరావు, జనార్దనరావు, వైకుంఠరావు పాల్గొన్నారు.

రణస్థలం: జాతీయ దత్తత అవగాహన మాసోత్సవాలు, బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు అనాథ పిల్లల దత్తత ప్రక్రియ గురించి మిషన్ వాత్సల్య - జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలల రక్షణ అధికారి ఇప్పిలి లక్ష్మీనాయుడు, ఐసిడిఎస్ సిడిపిఒ కె.రూపలత, ఎసిడిపిఒ బి.వి.లక్ష్మి, ఎపిఎం మాధవిలత, జిల్లా బాలల రక్షణ విభాగం ఔట్రీచ్ వర్కర్ ఎ.గీత, వెలుగు సిసి సత్యారావు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస : కూటమి ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన టిడిపి క్లస్టర్, బూత్ కన్వీనర్, మండల కన్వీనర్లతో బుధవారం ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా కీ.శే. ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం పలాస నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చౌదరి బాబ్జి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే, మంత్రులు ముఖ్యమంత్రి ఎంతో శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, డొక్కరి శంకర్, కత్తుల లక్ష్మణ్‌కుమార్, గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

షాపులో చోరీ

పలాస : మండలంలోని లక్ష్మీపురం జాతీయ రహదారి వంతెన సమీపంలో ఉన్న షాపులో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుడు కథనం మేరకు వజ్రపుకొత్తూరు మండలం గల్లీకి చెందిన దువ్వల హరీష్ మూడు నెలల క్రితం షాప్ పెట్టారు. రోజూ రాత్రి ఇంటికి వెళ్లి వేకువజామున నాలుగు గంటలకు షాప్ తెరుచుతారు. బుధవారం వేకువజామున హరీష్ దుకాణం తెరిచేందుకు వెళ్లగా తాళం పగులకొట్టి ఉంది. లోపలికి పరిశీలించగా, రూ.20 వేలు నగదు, మూడు వేల విలువ చేసే సామగ్రి, రెండు సెల్లు సెల్‌ఫోన్, చెవి దిద్దులు దొంగిలించినట్లు తెలిపారు. చోరీ ఘటనపై కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చోరీకి గురైన షాపు

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

ప్రజాశక్తి - నరసన్నపేట

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, నరసన్నపేట బ్రాంచ్ మేనేజర్ సీతారాం ప్రభుత్వ జూనియర్ కళాశాల, నరసన్నపేట ఏ అండ్ టి విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా ఒకేషనల్ విద్యార్థులకు ప్రత్యేక క్షేత్రస్థాయి శిక్షణ నిర్వహించినట్లు సీతారాం తెలిపారు. సాధారణ తరగతులతో పాటు, ఆన్ ఫీల్డ్ ప్రాక్టీస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల ఒజేటి జిల్లా కమిటీ సభ్యులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో డిజిటల్ కార్యకలాపాలు, డిపాజిట్లు, విత్ డ్రాయల్స్, నెఫ్ట్, ఆర్టీజీఎస్ ద్వారా చెల్లింపులు తదితర

అవగాహన కల్పిస్తున్న సీతారాం

అంశాలపై సూపర్ వైజర్ ఎం.మౌనిక, పి.మల్లీశ్వరి, విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. డిసెంబరు 31 వరకూ జిల్లాలో ఓజేటీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నాలుగు ప్రాంతీయ కమిటీలు జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణ చేస్తున్నాయని, జిల్లా కన్వీనర్‌గా సీనియర్ ప్రిన్సిపాల్ బి.శ్యామసుందర్ వ్యవహరిస్తున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

ఎమ్మెల్సీ రామారావును సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - సోంపేట

ఐకమత్యంతో తమ డిమాండ్ల సాధనకు పోరాటం చేస్తే కచ్చితంగా ఫలితం సాధిస్తామని అఖిల భారతీయ యాదవ జాతీయ మహాసభ తీర్మానం చేసింది. సోంపేట పట్టణంలోని విబిఆర్ కళ్యాణమండపంలో బుధవారం నిర్వహించిన మహాసభలో యాదవ జాతీయ అధ్యక్షులు మహేష్ యాదవ్, జాతీయ కార్యదర్శి అన్న రామచంద్రయ్య, రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు, రాష్ట్ర కార్యదర్శి ఆవుల నరసింహారావు పాల్గొన్నారు. సభ అధ్యక్షులు ఎమ్మెల్సీ, జిల్లా యాదవ అధ్యక్షులు నర్తు రామారావు మాట్లాడుతూ యువకులు విద్యావంతులు, మేధావులు యాదవ జాతి నుంచి తయారయ్యారని అన్నారు. ఐకమత్యంగా లేకపోవడం వలనే, రాజ్యాధికారానికి దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఆన్నా రామచంద్ర యాదవ్, మద్దెల నాగేశ్వరరావు, బంగారు కూరయ్య, దాసరి రాజు, పత్రి తవిటయ్య, కాళ్ల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు వివేకానంద స్ఫూర్తి

ప్రజాశక్తి - కవిటి

స్వామి వివేకానంద చికాగో సర్వమత మహాసభ ప్రసంగం-యువతపై ప్రభావం అనే అంశంపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు రామకృష్ణ మిషన్ ఆశ్రమం విశాఖపట్నం, సోంపేట శాఖల ఆధ్వర్యాన నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు స్వామి వివేకానంద జీవిత సందేశం పుస్తకాలను బహుమతిగా అందజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంపై, చారిత్రక అంశాలపై అవగాహన

బహుమతులతో విద్యార్థులు

పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సోంపేట అధ్యక్షులు గరుడాచలం శంకరరావు, సభ్యులు పొల్లాయి వాసుదేవరావు, జి.విష్ణుమూర్తి, పి.హరి, డి.అనసూయ, బి.శ్రీనుబాబు, జె.పాపారావు, కె.కరుణశ్రీ, డి.రమేష్, బి.అంజన, ఎల్.ఆనంద్, జనార్ధనరావు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

శక్తి రంగంలో కొత్త దిశ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి సమీపంలోని ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు డాక్టర్ బూడి శ్రీనివాసరావు, కనక రాజు కాళ్ల, తర్ర జగన్మోహనరావు, వి.వి.అప్పలనాయుడు మెండ సమన్వయంతో 'రిన్యూవబుల్ ఎనర్జీ ఇంటిగ్రేషన్ అండ్ పవర్ కండిషనింగ్ సిస్టమ్స్' అనే సాంకేతిక గ్రంథాన్ని రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరుత్పాదక శక్తి వనరుల సమీకరణ, విద్యుత్ శక్తి వినియోగ సామర్థ్యాలపై సమగ్ర అవగాహన కలిగించే ఈ గ్రంథం విద్యార్థులు, పరిశోధకులకు దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్‌ఆర్‌అండ్‌డి డాక్టర్ డి.శ్రీరాములు, హెచ్‌ఒడి డాక్టర్ డి.విజయకుమార్ రచయితలను అభినందించారు.

రేపట్నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మెళియాపుట్టి : మండలశాఖ గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు శాఖాగ్రంథాలయ అధికారి ఆర్.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠకుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు పలు సాంస్కృతిక, అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన, క్విజ్ పోటీలు, పుస్తక ప్రదర్శనలు వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించడం ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యమని తెలిపారు.

పోలాకి: ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి కింజరాపు మానస కోరారు. 14న వారోత్సవాలు ప్రారంభం, 15న పుస్తక ప్రదర్శన, 16న మహోన్నత వ్యక్తులతో ప్రసంగాలు, 17న కవి సమ్మేళనంపై ప్రసంగం, 18న యువతపై మాదక ద్రవ్యాలు ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు, 19న ముగ్గుల పోటీలు, 20న ముగింపు కార్యక్రమాలు, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు.

మాట్లాడుతున్న డివిఇఒ సురేష్‌కుమార్

నైపుణ్యాలతో ఉజ్వల భవిత

ప్రజాశక్తి - పలాస

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకుని ఉజ్వల భవిత అందుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఆర్.సురేష్ కుమార్ అన్నారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ఆన్ ది జాబ్ ట్రైనింగ్ (ఒజెటి) పొందుతున్న కాశీబుగ్గలోని మాస్టర్ కంప్యూటర్స్ ఎడ్యుకేషన్ సంస్థను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే ఇంటర్మీడియట్ దశ కీలకమన్నారు. కార్యక్రమంలో నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.భీమేశ్వరరావు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ గ్రూపు అధ్యాపకులు తమ్మినేని వాసుదేవరావు, ఎన్.జయప్రకాష్‌ఆచారి పాల్గొన్నారు.

24న ప్రతిభా పోటీ పరీక్ష

వజ్రపుకొత్తూరు : ఈ నెల 14న నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా కంబాలరాయుడుపేట మోడల్ ప్రైమరీ పాఠశాలలో నిర్వహించనున్న మండల స్థాయి ప్రతిభా పరీక్ష 24న వాయిదా వేసినట్టు మాతృభూమి అభివృద్ధి సంఘాల సమాఖ్య సభ్యులతో పాటు హెచ్‌ఎం లఖినాన కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఎస్ఎ పరీక్షలు నిర్వహిస్తున్న సందర్భంగా ఈ ప్రతిభా పోటీ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతిభా పోటీ పరీక్షలను విజయవంతం చేయాలని కోరారు.

విద్యా ప్రమాణాలు తప్పనిసరి

ఇచ్ఛాపురం: మండలంలోని డొంకూరు క్లస్టర్ పరిధిలో ఉన్న పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తప్పనసరిగా పాటించాలని క్లస్టర్ ఇన్‌ఛార్జి జి.హేమకుమారి అన్నారు. మండలంలోని సన్యాసిపుట్టు ఎంపియుపి, కేసుపురం క్లస్టర్ పరిధిలోని డొంకూరు ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.హేమకుమారి బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలా విధానంపై తగు సలహా సూచనలు ఉపాధ్యాయులకు తెలియపరిచారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.అరుణ్‌కుమార్, సూర్యారావు పాల్గొన్నారు.

ట్యూషన్ సెంటర్ సందర్శన

రణస్థలం: మండలంలోని దేరసాంలో పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఉచితంగా నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్‌ను జనసేన నాయకులు, పైడిభీమవరం పిఎసిఎస్ డైరెక్టర్ దన్నాన రవీంద్ర బుధవారం సందర్శించారు. సుమారుగా రెండేళ్ల నుంచి దన్నాన రవీంద్ర సొంత నిధులతో గ్రామంలో ఉన్న విద్యార్థుల కోసం ఉచితంగా ట్యూషన్ సెంటర్‌ను నడుపుతున్నారు. టీచర్లకు ప్రతినెలా అందించే నెలవారీ జీతాన్ని అందించారు. ట్యూషన్ సెంటర్‌లో ఓ విద్యార్థి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో శివాజీ, సత్యనారాయణ, మహేష్, అచ్చోడు, నరేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రూ.30 వేలు ఆర్థికసాయం

పలాస : కాశీబుగ్గ 11వ వార్డుకు చెందిన నిరుపేద ఒడియా బ్రాహ్మణ బాధిత కుటుంబానికి స్థానిక జైజగన్నాథ బ్రాహ్మణ సంఘం సభ్యులు బుధవారం రూ. 30 వేల ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల కుటుంబ యజమాని లోకనాథ త్యాడి ఆనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబానికి నగదు సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ త్యాడి, కార్యదర్శి బాబూరావు పండా, సభ్యులు నిత్యానంద్ పండా, ప్రసాద్ పాత్రో, రాజేష్ పండా, హరిశంకర్ త్రిపాఠీ పాల్గొన్నారు.

యాదవ సంఘ పట్టణ అధ్యక్షునిగా ధర్మతేజ

ఇచ్ఛాపురం : అఖిల భారత యావ సంఘ ఇచ్ఛాపురం మున్సిపాలిటీ అధ్యక్షునిగా కాళ్ల ధర్మతేజను నియమించారు. సోంపేట విబిఆర్ కళ్యాణ మండపంలో బుధవారం యాదవుల ఆత్మీయ సమ్మేళం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షునిగా జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ నర్తు రామారావు బాధ్యతలు అప్పగించారు. పట్టణంలో సంఘ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు మహేష్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు లాగా వెంగల్‌రావు పాల్గొన్నారు.

పోలాకి : మాట్లాడుతున్న ఎంపిడిఒ రవికుమార్

వైద్య శిబిరాలకు స్పందన

నరసన్నపేట : స్థానిక నారాయణ స్కూల్‌లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. క్యాంప్ సెంట్రల్ ఆఫీస్ సౌజన్యంతో విశాఖపట్నం కేర్ ఆస్పత్రి, డెంటల్ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో స్కూల్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.ఎస్.రాజేష్, ఆర్ఐ రాంబాబు, ఎజిఎం ఐ.రమేష్, ప్రిన్సిపాల్ ఎ.రమేష్, డీన్ హరి, ఎఒ రామకృష్ణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన తెలుకుంచిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కళ్యాణి 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని ఎంపిడిఒ ప్రభాకర్ సందర్శించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి 43 కొత్త ఓటర్లు చేరు 6 ఫారాన్ని నింపించారు. అలాగే రంగోలి పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మెరుగు సూర్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒ పాండవ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పోలాకి : బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపిడిఒ జి.రవికుమార్ సూచించారు. మండలంలోని గంగివలస కెజిబివి పాఠశాలలో విద్యార్థినులకు పోలాకి పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీనాథ్ బుధవారం అవగాహన కల్పించారు. పౌష్టికాహారం ప్రాధాన్యత, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ప్రతిభతోనే గుర్తింపు

ప్రజాశక్తి - నందిగాం

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సిపురంలో విద్యోన్నతి అనే నూతన కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు సిహెచ్.వెంకటరమణ బుధవారం ప్రారంభించారు. అకడమిక్ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇది ఆరోగ్యకరమైన పోటీని, చదుకోవాలనే కోరికను పెంపుంది స్తుందని అన్నారు. ఉపాధ్యాయులకు సర్పంచ్ పి.లచ్చయ్య, గ్రామ పెద్దలు జి.ప్రకాశరావు, దామోదరరావు, హిరణ్యారావులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.శేషగిరి, ఆర్.రమేష్‌కుమార్, తాతారావు, జయరాం, అమీన్, జె.సరోజిని పి.దీపలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

టెక్కలి : సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు అమలులో ఉన్న చట్టాలపై అవగాహన అవసరమని టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న కేన్ నిర్వాహకులు కుప్పిలి ప్రసన్న ఆన్నారు. ఈ మేరకు బుదవారం చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాటాల్డఉతూ బాలికలు ఉన్నతంగా చదివి అభివృద్ధి సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ తిరుపతిరావు మాట్లాడుతూ విద్యార్థినులు తమ చుట్టూ ఉన్న పరిసరాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిఆపల్ వట్టికూళ్ల కిరణ్‌కుమారి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న విద్యార్థులు

కవిటి: బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు ఎస్‌విజె డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 విద్యార్థులు నెలవంకలో చేపట్టిన ప్రత్యేక సేవా శిబిరం కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులు "స్వచ్ఛాంధ్ర-సర్ణాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామంలోని వీధులను శుభ్రపరిచారు. అనంతరం నిరక్షరాస్యత నిర్మూలనకు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి ప్రజలకు విద్య ప్రాధాన్యతను వివరించారు. అనంతరం రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌విజె డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్.రమేష్ వాలంటీర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత టెక్కలి

ప్రజాశక్తి - పలాస

మండలంలోని బొడ్డపాడు యువజన సంఘం ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ విజేతగా టెక్కలి టీం నిలిచింది. వివిధ ప్రాంతాల నుంచి వాలీబాల్ పోటీల్లో టీంలు పాల్గొన్నాయి. ద్వితీయ స్థానంలో పలాస మండలం మాకన్నపల్లి, మూడో స్థానంలో మందస మండలం గుడ్డిభద్ర, నాలుగో స్థానంలో వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం నిలిచింది. ప్రథమ స్థానంలో నిలిచిన టెక్కలి టీంకు రూ.5 వేలు నగదు, షీల్డ్, మాకన్నపల్లి టీమ్‌కు రూ. 4 వేలు నగదు, షీల్డ్, గుడ్డిభద్ర టీమ్‌కు రూ. 3 వేలు నగదు, షీల్డ్, బాతుపురం టీమ్‌కు రూ.2 వేలు నగదు, షీల్డ్‌ను జైభీం యువజన సంఘం అధ్యక్షుడు పోతనపల్లి గణపతి అందజేశారు. వాలీబాల్ పోటీలకు బొడ్డు దుష్యంతు, ఎం.అనిత, తిరుపతిరావు, రాపాక జోగారావు, బొడ్డు డిల్లీ రావులు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో జైభీం యువజన సంఘం మాజీ అధ్యక్షులు కిక్కిర ఢిల్లీరావు, తామడ క్రాంతి, మాజీ సర్పంచ్ తామడ త్రిలోచనరావు, బొడ్డు సింహాద్రి, బి.జగన్ పాల్గొన్నారు.

షీల్డ్‌ను అందజేస్తున్న గణపతి

యువత సన్మార్గంలో నడవాలి

టెక్కలి : విద్యార్థులు సన్మార్గంలో నడవాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. కళాశాల ఆవరణలో బుధవారం కామర్స్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెల్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ మోదుగువలస ధుర్యోదనరావు మాట్లాడుతూ డిగ్రీ చదువుకుంటున్న విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదన్శనలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, అధ్యాపకులు లూక్ పాల్, వాసుబాబు, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

ఎమ్మెల్యే శిరీషతో రమేష్

టిడిపి బలోపేతానికి కృషి

వజ్రపుకొత్తూరు: గ్రామస్థాయి నుంచి టిడిపి బలోపేతానికి కృషి చేస్తానని కొండవూరు మాజీ సర్పంచ్, మండల టిడిపి కార్యదర్శి కొల్లి రమేష్ అన్నారు. బుధవారం టిడిపి మండల కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఎమ్మెల్యే గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పనిచేస్తానని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి అన్ని సర్పంచ్, ఎంపిటిసి స్థానాలు కైవసం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

సిఎం సహాయనిధి అందజేత

పలాస : స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి కింద రూ.10.85 లక్షల చెక్కులను ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సిఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, కత్తుల లక్ష్మణ్‌కుమార్, వడ్డి యాదగిరి, అంబటి కృష్ణమూర్తి, ఆళ్ల కృష్ణారావు పాల్గొన్నారు.

కెజిబివికి స్టేషనరీ సామగ్రి వితరణ

ఇచ్ఛాపురం : కెజిబివి బాలికలకు అవసరమైన స్టేషనరీని బుధవారం విశ్రాంతి కెప్టెన్ సుమన్ అందించి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శిరీష అభినందించారు. విశ్రాంతి కెప్టెన్ సుమన్ ఇప్పటికే సురంగి రాజా క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి పలువురు చేతల ప్రశంసలు అందుకున్నారు.

నూతన గృహాలకు జియోట్యాగింగ్



జియోట్యాగింగ్ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలో ప్రభుత్వం నూతన గృహాల నిర్మాణాలకు చేపట్టిన సర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని రట్టినిలో బుధవారం హౌసింగ్ అధికారులు జియో ట్యాగింగ్ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ఇల్లు పొందాలనుకున్న వారు తమ ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. లబ్ధిదారులు తప్పనిసరిగా తమ ఖాళీ స్థలం వద్ద హాజరై, అధికారులు తీసే ఫొటోలు, వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సర్వే వారం రోజుల పాటు కొనసాగనుందన్నారు. కొత్తగా ఇల్లు కట్టాలనుకుంటున్నవారు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ కె.గణేష్‌కుమార్, మాజీ సర్పంచ్ రవీంద్ర జెన్నా, ఎఎంసి డైరెక్టర్ చింతల ప్రశాంత్, మీలా మున్నా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

సోంపేట : మండలంలోని పాత్రకొండలోపశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యాన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పశు గణాభివృద్ధి సంస్థ జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ సిహెచ్.సత్యప్రకాష్ మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులపై కచ్చితమైన అవగాహన, పశుపోషకులు అందరికీ ఉండాలని సూచించారు. సంతానోత్పత్తికి ఉపయోగపడని పాడి పశువులను పశు వైద్యుల సూచనలు, సలహాలతో వైద్యం చేయించుకుని సంతానానికి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బేసి రామచంద్రపురం పశు వైద్యశాల డాక్టర్ బి.శిరీష, మాజీ సర్పంచ్ విశ్వనాథం ఖగేశ్వరరావు, హనీష, బాలకృష్ణ, హరికృష్ణ, కుశల, సాయిదాబి తదితరులు పాల్గొన్నారు.

పశువులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది